

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు :	రూ.5,21,495
బంగారం :	4 గ్రాముల 220 మిల్లీ గ్రాములు
వెండి :	50 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



గి'రాఖీ'

నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో విక్రయిస్తున్న వరి విత్తనాలతో చేసిన రాఖీలకు మంచి ఆదరణ లభిస్తోంది.

- 8లో



రిమాండ్‌కు నిందితుడు

సిమ్ బాక్స్ కేసులో అరెస్టైన నిందితుడు రాజు మండల్‌ను భువనేశ్వర్ కమిషనరేట్ పోలీసులు 5 రోజుల రిమాండ్‌కు తరలించారు.

- 8లో

న్యూస్‌రీల్

నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

రాయగడ: అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు జడ్జి శ్వేత మిశ్రా శనివారం సంచలన తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. 2019 సెప్టెంబర్ 7వ తేదీన స్థానిక అంబగుడ హరిజన వీధిలో నివసిస్తున్న బుదుబాగ్ అనే వ్యక్తి, అదే వీధిలో నివసిస్తున్న ఒక ఇంట్లోని మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. దీనిపై బాధితురాలి తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసు విచారణకు రాగా జిల్లా జడ్జి శ్వేత మిశ్రా పర్వాపురాలు పరిశీలించిన మీదట ఈ మేరకు సంచలన తీర్పు ఇచ్చారు. ఒకవేళ నిందితుడు రూ.10 వేల జరిమానా చెల్లించకుంటే మరో 6 నెలల పాటు అదనంగా జైలు శిక్షను అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి



శుభం మృతదేహం

రాయగడ: విద్యుత్ షాక్‌తో ఒక విద్యార్థి మృతి చెందిన ఘటన స్థానిక విద్యానగర్ మూడో లైన్‌లోని మున్సిపల్ పార్క్ ప్రాంగణంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడు స్థానిక వివేకానంద పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న శుభం శేఖర్ స్వాయిగా గుర్తించారు. స్కూల్ నుంచి సాయంత్రం వచ్చిన శుభం ప్రతీరోజు మాదిరిగానే స్నేహితులతో కలిసి పార్క్‌లో ఆడుకునేందుకు వెళ్లాడు. కాగా కొద్దిసేపటికే అక్కడ అచేతనంగా పడి ఉన్న శుభంను చూసిన తోటి స్నేహితులు అతని తల్లికి చెప్పారు. దీంతో అక్కడికి పరుగున వెళ్లిన శుభం కుటుంబీకులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. అయితే శుభం అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. విద్యుత్ షాక్ కారణంతోనే శుభం మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



చెట్టు నుంచి మృతదేహాన్ని దించుతున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 42 గ్రామానికి చెందిన ఒక వృద్ధుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎంవీ 42 గ్రామానికి చెందిన త్రిపురారి బిశ్వస్ (66) శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు. అయితే ఎక్కడో ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. కానీ ఆదివారం ఉదయం గ్రామ శివారులోని ఒక చెట్టుకు ఉరివేసుకొని మృతదేహమై కనిపించాడు. దీంతో వెంటనే స్థానికులు మల్కన్‌గిరి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ రీగా నేకిండో తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని దింపి కేసు నమోదు చేశారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. అతని భార్య కొత్తకాలం క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి అతడు మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని, అందువలనే ఇలా చేసి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు ఒక గంజాయి కేసులో పరారీలో ఉన్నటువంటి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేదీన 525 కేజీల గంజాయి అక్రమ రవాణాలో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారయ్యారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి కోరుకొండ సమితి పడల్‌పుట్ గ్రామానికి చెందిన భక్తిరామ్, ధన్ ముదిలిలను అరెస్టు చేశారు. వారిని కోర్టులో సోమవారం హాజరుపరుస్తామని బలిమెల ఐఐసీ సుమన్ పట్నాయిక్ తెలిపారు.

- రాష్ట్రంలో తీరని బంగాళదుంపల బెంగ
- పశ్చిమ బెంగాల్ నుంచి సరఫరాకు అంతరాయం
- యూపీ దుంపలు రుచించక అయోమయం



అటు ఫలించక.. ఇటు రుచించక..!

భువనేశ్వర్: రాష్ట్రంలో బంగాళా దుంపల సంక్షోభం ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పొరుగు రాష్ట్రం పశ్చిమ బెంగాలుతో పొత్తు కుదరక ఈ పరిస్థితి తాండవిస్తోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వం ఇప్పుడు ఉత్తరప్రదేశ్ నుంచి రైలు ద్వారా బంగాళాదుంపలను తీసుకురావాలని యోచిస్తోంది. ఈ మేరకు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు రాష్ట్ర ఆహార సరఫరాలు మరియు వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో ఆదివారం మీడియాకు తెలియజేశారు. రెండు రైళ్లలో బంగాళా దుంపలను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ఏడాది జూలై నుంచి రాష్ట్రంలో బంగాళా దుంపల సంక్షోభం తాండవిస్తున్నా, ప్రభుత్వం నిర్మాణాత్మక చర్యలు చేపట్టలేక తల్లడిల్లుతోంది. పశ్చిమ బెంగాల్ నుంచి సరఫరాలో అంతరాయం కారణంగా ఇరు రాష్ట్రాల సరిహద్దుల వెంబడి రవాణాకు అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలో బంగాళా దుంపల నిల్వలు అడుగంటిపోయాయి. రాష్ట్ర ప్రజల నిత్య వినియోగ బంగాళా దుంపల ధరల పెరుగుదలను సామాన్య ప్రజానీకానికి తలకు మించిన భారంగా పరిణమించింది.

ఉత్తరప్రదేశ్ రుచించదు


దీర్ఘకాలంగా పొరుగు పశ్చిమ బెంగాలు బంగాళా దుంపల రుచికి అలవాటు పడిన ప్రజానీకం ఉత్తరప్రదేశ్ ఆలుగడ్డలవైపు మొగ్గు చూపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మక ప్రయత్నాలు ఈ వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చాయి. ప్రజలకు రుచించని ఉత్తరప్రదేశ్ ఆలుగడ్డలతో వ్యాపారం లాభసాటి కాలేదని రాష్ట్ర వ్యాపారుల సంఘం వెనుకంజ వేస్తోంది.

మారని ప్రభుత్వ వైఖరి

అటు వినియోగదారులు, ఇటు వ్యాపారులు ఉత్తరప్రదేశ్ ఆలుగడ్డలపై ఆసక్తి కనబరచకున్నా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారడం లేదు. ఏదో ఒక మార్గాన ఉత్తరప్రదేశ్ ఆలుగడ్డలను ప్రజలకు అలవరిచే ప్రయత్నంలో శతవిధాల ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ పరిస్థితిపై రాష్ట్ర విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి బంగాళా దుంపల రవాణా తక్షణమే పునరుద్ధరించాలని అభ్యర్థిస్తూ లేఖ రాశారు. ఢిల్లీలో కలిసిన సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిని అభ్యర్థించిన విషయం తెలిసిందే. అయితే పశ్చిమ బెంగాల్‌పై ఆలుగడ్డల కోసం ఆధారపడటాన్ని నియంత్రించుకోవాలనే దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రత్యామ్నాయ వనరుగా ఉత్తరప్రదేశ్ నుంచి బంగాళాదుంపలను దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. ఇరుగు పొరుగు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభేదాలతో రాష్ట్రంలోని ప్రజలు, పశ్చిమ బెంగాలులో వ్యాపారులు విపరీతంగా ప్రభావితం అవుతున్నారు.

భక్తులకు ఉచిత మహాప్రసాదం

- మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్



స్వామివారి మహా ప్రసాదం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో జగన్నాథ స్వామివారిని దర్శనం చేసుకునే భక్తులకు మహాప్రసాదం ఉచితంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలియజేశారు. అయితే పంపిణీ ఎలా, ఎప్పుడు ప్రారంభిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. అలాగే శ్రీమందిరానికి సంబంధించిన వివిధ ఆచారాలు, సేవలు, జగన్నాథ సంస్కృతికి సంబంధించిన సమాచారాన్ని అందించే వివరణ వ్యాఖ్యాన కేంద్రం పూరీలో ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. కాగా భక్తులకు ఉచితంగా మహా ప్రసాదంపై రాష్ట్ర ప్రభుత్వ చొరవ అభినందనీయమని పూరీ శ్రీమందిర్ సువార్ మహాసువార్ నియోగుల సంఘం తెలిపింది. ఈ సంఘం అధ్యక్షుడు పద్మనాభ మహాసువార్ మాట్లాడుతూ ఈ యోచన కార్యాచరణకు ప్రత్యేక నిధుల ఆవశ్యకతను, వనరుల సమీకరణ ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఉదయం పూట శ్రీమందిరం సందర్శకులకు సుఖిలా భోగాన్ని (పొడి ప్రసాద పదార్థాలు) పంపిణీ చేయడం ఈ ప్రణాళిక లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం మొదట 2017లో ప్రారంభమైందని గుర్తు చేశారు. భక్తులకు పరిమిత పరిమాణంలో మహాప్రసాదం పంపిణీ చేయబడేది. అయితే అతి తక్కువ సమయంలోనే నిలిపి వేయబడిందన్నారు. బీజేపీ ప్రభుత్వం మళ్లీ మహా ప్రసాదం పంపిణీని ప్రారంభిస్తే సర్వత్రా ప్రసంశలు అందుకుంటుందన్నారు.

కాంగ్రెస్‌లోనూ నన్ను శత్రువులా చూస్తున్నారు

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

కొరాపుట్: ఇప్పటివరకు తనకు బీజేపీ, బీజేడీలోనే శత్రువులు ఉండగా, ఇప్పుడు కాంగ్రెస్‌లోనూ కొంతమంది శత్రువులా చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కూడా తన కాళ్లను పట్టుకొని లాగేస్తునారని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనని ధైర్యంగా చెప్పగలనన్నారు. కొంతమంది వ్యక్తిగత రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ పార్టీకి నష్టం చేకూరుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న విభేదాలను ప్రజలు అంగీకరించరని దుయ్యబట్టారు. ఒడియా స్వాభిమానాన్ని కాంగ్రెస్ పార్టీ అందుకోలేకపోవడంతోనే బీజేపీ ఆ అవకాశం తీసుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ అధికారంలో నిమగ్నమవ్వగా, బీజేడీ గ్రామాల్లో పార్టీ పటిష్టతకు పనిచేస్తోందని, అయితే కాంగ్రెస్ మాత్రం విభేదాల్లో మునిగిపోయిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

కేంద్రమంత్రి జుయెల్‌కు భార్య వియోగం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఎం మోహన్‌చరణ్



ఝింగియా ఓరమ్

భువనేశ్వర్: కేంద్ర దళిత వ్యవహారాల విభాగం మంత్రి జుయెల్ ఓరమ్ భార్య ఝింగియా ఓరమ్ (58) ఆదివారం మృతి చెందింది. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో డెంగితో చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె స్వగ్రామం సుందర్‌గడ్ జిల్లా కెందుడిహికి పార్థివ దేహం తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రముఖుల సంతాపం

మంత్రి భార్య మృతిపై గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, తోటి మంత్రులు, శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, విపక్ష నేత సంతాపం ప్రకటించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్థానిక లుంబినీవిహార్ నివాసంలో ఝింగియా ఓరమ్ మృతదేహానికి నివాళులర్పించారు.

సమస్యలపై పోరాడుతాం

- ఎంపీ సప్తగిరి ఉలక



ఎంపీ సప్తగిరిని సన్మానిస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

రాయగడ: జిల్లాలోని వివిధ సమస్యలపై తాము పోరాడి, అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తామని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం జరిగిన పౌర సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని బిసంకటక్, రాయగడ, గుణుపూర్ శాసనసభలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తమను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నిరంతరం సమస్యల పరిష్కారానికి పోరాడుతామని పేర్కొన్నారు. రాయగడలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అదేవిధంగా రాయగడ పట్టణం నడిబొడ్డున ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని, దీనిని మరామ్మతులు చేయించేవిధంగా కృషి చేస్తానన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం

ఎంపీ సప్తగిరి ఉలక, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికకలను వేదికపై సన్మానించారు. పట్టణంలోని వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో పాటు శాలువాలను కప్పి ప్రజాప్రతినిధులను సత్కరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రమౌళి కుముంధాన్ నేతృత్వంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో భాగంగా ఎంపీ సప్తగిరికి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, సీనియర్ జర్నలిస్ట్ బాదల్ కుమార్ ధా తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్ల కోసం రాఖీలు

- వేడుకలకు శ్రీమందిరంలో సన్నాహాలు



రాఖీలు తయారు చేస్తున్న పటరా బిషోయి సేవకులు

భువనేశ్వర్: శ్రీమందిరంలో దేవుళ్ల కోసం రాఖీలు తయారు చేస్తున్నారు. గమ్హా పూర్ణిమ పురస్కరించుకుని శ్రీజగన్నాథుడు, బలభద్ర స్వామికి సోదరి సుభద్ర రాఖీధారణ చేస్తుంది. ఏటా చిత్తా లగ్గి అమావాస్య మర్నాటి నుంచి మూల విరాటుల కోసం రాఖీ తయారీ సన్నాహాలకు శ్రీకారం చుడతారు. స్థానిక డోలో మండపం వీధిలో పటరా (పట్టు) బిషోయి వర్గం సేవాయతులు తమ ఇంటిలో వీటిని తయారు చేస్తారు.

ఒక్కొక్కరికీ రెండు

రత్న వేదికపై కొలువుదీరిన శ్రీజగన్నాథుడు, బలభద్ర స్వామికి చెరో రెండు చొప్పున రాఖీలు ధరిస్తారు. వీటితో వక్క మాలలు ధరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. రాఖీ తయారీ కోసం అవసరమైన పట్టు పోగులను శ్రీమందిరం అధికార వర్గాలు అందజేస్తాయి. ఆచారం ప్రకారం వీటిని రంగుల్లో ముంచి కొలత ప్రకారం పోగులను సరిచేసి పేమడంతో రాఖీ తయారవుతుందని పటరా (పట్టు) బిషోయి సేవకుడు సంతోష్ కుమార్ పాత్రో తెలిపారు. సహజమైన పసుపు, ఎరుపు, నీలం, ఊదా (వంకాయ) రంగుల్లో పట్టు పోగులను ముంచి వన్నె దిద్దుతారు. వీటిని నిర్దిష్ట పరిమాణంలో కత్తిరించి గుండ్రంగా తయారు చేస్తారు. 5 అంచెల రాఖీలను తయారు చేస్తారు.

వక్క మాలలు

రాఖీలతో వక్కమాలలు ధరించి రాఖీ పౌర్ణమి నాడు ప్రత్యేక శోభతో భక్తులకు దర్శనం లభిస్తుంది. ఒక్కో మాలలో 54 చొప్పున వక్కలు ఉంటాయి. ఇటువంటి 4 వక్క మాలలు సిద్ధం చేస్తారు. రాఖీ తయారీ నిష్ఠతో నిర్వహించాల్సిన ప్రక్రియ. దైనందిన ఆహార పానీయాలు మొదలుకొని అన్ని రంగాల్లో పవిత్రతను కాపాడుకోవాలని సేవాయతులు పేర్కొన్నారు.

భిన్న వర్ణాల మాలలు

మూల విరాటులు నాలుగు పెద్ద రాఖీలతో పాటు రెండు చొప్పున వక్క మాలలతో శోభిల్లుతారు. శ్రీజగన్నాథుడు పసుపు, ఎరుపు రంగులో ఉన్న వక్క మాలలు, బలభద్రుడు నీలం, ఊదా (వంకాయ) రంగుల మాలలు ధరిస్తారు. అలాగే శ్రీమందిరం సరఫరా చేసిన పట్టు పోగులతో పదిహేను చిన్న రాఖీలను తయారు చేస్తారు. పార్శ్వ దేవతలు ఈ రాఖీలని ధరిస్తారు. అనంతరం మూల విరాటుల నుంచి తొలగించిన రాఖీల్లో ఒకటి స్వామి తొలి సేవకుడు గజపతి మహారాజాకు సమర్పిస్తారు. మిగిలిన రాఖీలను భండార గృహానికి తరలిస్తారు.

కిడ్నీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు



కారుతో అరెస్టైన నిందితులు

జయపురం: ఈవీఎం బాక్స్‌లు తీసుకెళ్తున్న ఒక వ్యాన్ డ్రైవర్‌ని కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ బిశాయి వెల్లడించారు. అరెస్టైన వారు కొరాపుట్ జిల్లా నందపూర్ గ్రామానికి చెందిన మణితోష్ బాలా, ఉమేష్ ఖొరలుగా వెల్లడించారు. వారి నుంచి ఒక కారుని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసు అధికారి తెలిపిన వివరాల మేరకు.. గత నెల 16వ తేదీన నవరంగపూర్ డిప్యూటీ కలెక్టర్, మేజిస్ట్రేట్ పి.మనస్విత పర్యవేక్షణలో ఒక వ్యాన్‌లో మూడు ఈవీఎం మిషన్లను కొరాపుట్ సెంట్రల్ హబ్‌లో అప్పగించమని డ్రైవర్‌ను ఆదేశించారు. దీనిలో భాగంగా ముందు ఈవీఎంల వ్యాన్ వెళ్తుండగా, వెనుక కారులో డిప్యూటీ కలెక్టర్ వెళ్తున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో జయపురం గాంధీ జంక్షన్ వద్దకు వ్యాన్ వచ్చింది. ఆ సమయంలో ఒక కారు వ్యాన్‌ను వెంబడిస్తూ వచ్చి అకస్మాత్తుగా వ్యాన్ ముందు ఆగింది. ఆ కారులో మణితోష్, ఉమేష్‌లు ఉన్నారు. వారు వ్యాన్ డ్రైవర్ ప్రహ్లాద్ గొడతో గొడవ పెట్టుకున్నారు. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతరం వారు వేన్ డ్రైవర్‌ను కిందికి దించి అతడిని బలవంతంగా తమ కారులో కొరాపుట్ వైపు తీసుకెళ్లారు. అనంతరం కొరాపుట్ ముందు దించివేసి వెళ్లిపోయారని నబరంగపూర్ డిప్యూటీ కలెక్టర్ పి.మనస్విత జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచినట్లు పోలీసు అధికారి వెల్లడించారు. డ్రైవర్ అపహరణకు గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి



జయపురం: పొలంలోకి దూసుకెళ్లిన కారు



పర్లాకిమిడి: మృతి చెందిన ఆకాష్

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా సమితి మునిసింగి ఘాటీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సెరంగో పోలీసు అధికారి పి.కె.రథ్ తెలిపిన వివరాల మేరకు.. గుమ్మా నుంచి పర్లాకిమిడికి గుసాని సమితి బుసుకిడి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వస్తుండగా, మునిసింగి ఘాటి వద్ద బైక్ అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో కాకిపల్లి ఆకాష్(21) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన సెల్లి విజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయాలైన యువకుడు సెల్లి విజయ్‌ను శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సెరంగో పోలీసు అధికారులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

కారు ఢీకొని మరొకరు

జయపురం: కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి బురుడిపుట్ గ్రామానికి చెందిన సోనియా దొర, అతడి బావ తమ పొలంలో పనిచేశారు. సాయంత్రం అవ్వడంతో సోనియా దొర తన బైక్ పెట్టిన పొలం గట్టున కూర్చొని విశ్రాంతి తీసుకుంటుండగా, అతడి బావ పొలంలో మందులు చల్లుతున్నాడు. ఆ సమయంలో మల్కన్‌గిరి జిల్లా ఖొయిరిపుట్ ప్రాంతానికి చెందిన మమతా సాగరియ, ఆమె కుమారుడు జమునికాంత సాగరియలు ఒక కారులో నవరంగపూర్ జిల్లా డాబుగాం పనిపై వెళ్లి తిరిగి తమ స్వగ్రామం వస్తున్నారు. అయితే కారు అతివేగంగా వస్తూ పొలం గట్టున ఉన్న బైక్‌ను ఢీకొని, అక్కడే కూర్చున్న సోనియాను సైతం ఈడ్చుకొని పొలంలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న తల్లీ కుమారులు క్షేమంగా బయటపడ్డారు. అయితే సోనియ దొర తీవ్రంగా గాయపడడంతో అతడిని వెంటనే స్థానికులు బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మరణించినట్లు డాక్టర్లు ప్రకటించారు. బొయిపరిగుడ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి రెండు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ నిజాయితీ



దొరికిన పర్స్‌తో కృష్ణ కిరసాని

కొరాపుట్: రోడ్డుమీద తనకు దొరికిన పర్సును యజమానికి అప్పగించి ఒక ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రానికి సమీపంలోని బరిగుడ గ్రామానికి చెందిన కృష్ణ కిరసాని ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఎప్పటిలాగే కొరాపుట్ జిల్లా కేంద్రానికి వస్తున్న సమయంలో రోడ్డు మీద ఒక పర్స్ కనిపించింది. అదితీసి చూడగా అందులో రూ.9 వేల నగదు, పలు ఏటీఎం కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు ఉన్నాయి. అలాగే పర్స్ లోపల యజమాని ఫోన్ నంబర్ ఉండడం గుర్తించాడు. దీంతో వెంటనే ఆ మార్గం గుండా వెళ్తున్న ఒక విద్యార్థి ద్వారా పర్స్ యజమానికి ఫోన్ చేయించి, తనకు పర్స్ దొరికిన విషయాన్ని తెలియజేశాడు. దీంతో వెంటనే ఆ యజమాని కృష్ణ వద్దకు వచ్చి తన పర్స్‌ను తీసుకొని, కృష్ణ నిజాయితీకి ఉప్పొంగిపోయాడు. పేదరికంలో ఉన్నా పరాయి సొమ్ముకు ఆశపడని కృష్ణను అభినందించాడు.

రిమాండ్‌కు నిందితుడు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సిమ్ బాక్సులు

భువనేశ్వర్: సిమ్ బాక్స్ కేసులో అరెస్టైన నిందితుడు రాజు మండల్‌ను భువనేశ్వర్ కమిషనరేట్ పోలీసులు 5 రోజుల రిమాండ్‌కు తరలించారు. విచారణ సందర్భంగా రాజు మండల్ అందించిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం కటక్ మధుపట్న పోలీస్ ఠాణా పరిధిలోని రాజేంద్రనగర్ ప్రాంతంలో అద్దెకు ఉన్న ఫ్లాట్‌పై దాడి చేశారు. ఈ దాడిలో మరో 5 సిమ్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఇప్పుడు రాజు మండల్‌కి ఉన్న ఉగ్రవాద సంబంధాలను పరిశోధిస్తారని, ప్రధాన సూత్రధారి, బంగ్లాదేశ్ పౌరుడు అషద్దూర్ జమాన్ గురించి తదుపరి విచారణలు చేస్తారని భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. అవసరమైనప్పుడు ఎన్ఐఏ, ఇంటర్‌పోల్ సాయం తీసుకుంటారన్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న డెంగీ కేసులు

భువనేశ్వర్: రాష్ట్రంలో డెంగీ రోగుల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. దోమల ద్వారా వ్యాపించే ఈ వ్యాధికి ఖుర్దా కేంద్రంగా మారినట్లు కనిపిస్తోంది. తాజా అధికారిక గణాంకాల ప్రకారం ఒడిశాలో ఇప్పటివరకు 2,000 డెంగీ కేసులు నమోదయ్యాయి, ఖుర్దాలో అత్యధికంగా 500 పైబడి ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఖుర్దాతో పాటు సుందర్‌గఢ్, రౌర్కెలా, బొలంగీర్, కటక్‌లలో డెంగీ కేసులు పెరిగాయని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా ఆదివారం మీడియాకు తెలిపారు. స్థానిక నగర పాలక సంస్థ(బీఎంసీ) మేయర్ సులోచన దాస్ విలేకరులతో మాట్లాడుతూ.. రాజధాని నగరంలో డెంగీ కేసులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకుంటోందని, ప్రతి ఒక్కరూ దోమతెరలు ఉపయోగించాలని పిలుపునిచ్చారు. జ్వరం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. నీటి నిల్వ లేకుండా నగరవ్యాప్తంగా పొడి దినం (డ్రై డే) కార్యక్రమం చేపట్టింది. కార్యక్రమంలో నగర వాసులు పాలుపంచుకుని డెంగీ పారదోలడంలో సహకరించాలన్నారు.

పిడుగుపాటుకు ఆరుగురు మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఆదివారం 6 మంది పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయినట్లు రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయం తెలిపింది. కేంద్రాపడా, బాలాసోర్, జాజ్‌పూర్, సువర్ణపూర్, భద్రక్ జిల్లాల్లో 6 పిడుగుపాటు మరణాలు నమోదయ్యాయి. కేంద్రాపడా జిల్లాలో పట్టాముండై పరిధిలోని బాసుదేబ్‌పూర్, గారా గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా బాలాసోర్‌లోని సూర్‌వాడ గ్రామంలో మరొకరు మృతి చెందాడు. ఈ గ్రామంలో మరో 4 మంది గాయపడ్డారు. జాజ్‌పూర్ జిల్లాలోని ధరమ్ ఛాయా భబానీపూర్‌లో పిడుగుపాటుకు ఓ రైతు మృతి చెందగా, సువర్ణపూర్ జిల్లాలోని బినికా ప్రాంతంలోని తిలేమాల్‌లో మరో రైతు మృతి చెందాడు. ఆరో మరణం భద్రక్ జిల్లాలోని భండారిపొఖారి నెరడా గ్రామంలో నమోదైనట్లు ఎస్ఆర్‌సీ పేర్కొంది. మృతుల కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున (ఒక్కొక్కరికి) ఎక్స్‌గ్రేషియా సీఎం మోహన్‌చరణ్ మాఝీ ప్రకటించారు.

పేకాట శిబిరంపై దాడి

ఆమదాలవలస: మండలంలోని దన్నానపేట సమీపంలో గల ఎస్‌వీఎస్ దాబా పక్కన తోటలో పేకాట శిబిరంపై ఆదివారం ఆమదాలవలస పోలీసులు చేసిన దాడిలో ముగ్గురు వ్యక్తులు పట్టుపడినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు.

గిరాఖీ



గణేషుని ఆకృతిలో రాఖీ



తక్కువ ధరతో ఉండే రాఖీలు



వరి విత్తనాలతో తయారు చేసిన జగన్నాథ స్వామి రాఖీలు

వరి విత్తనాలతో చేసిన రాఖీలకు మంచి ఆదరణ లభిస్తోంది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వం ఈ విక్రయ కేంద్రం ఏర్పాటు చేసింది. జిల్లాలోని కొసాగుమ్డ సమితి లింబట్టా గ్రామానికి చెందిన గిరిజనులు వీటిని తయారు చేస్తున్నారు. వీరి నైపుణ్యం గుర్తించిన ఒర్మాస్ అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించారు. వారి రాఖీలు చూసి అభినందించారు. వీరు విక్రయించుకోవడానికి ప్రభుత్వ సహకారంతో విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ రాఖీల తయారీలో ఎటువంటి రసాయనాలు, ప్లాస్టిక్ పదార్థాలు వినియోగించడం లేదు. కేవలం విత్తనాలు, సేంద్రీయ రంగులు, ప్రత్తి దారాలు, కాగితాలు వినియోగిస్తున్నారు. అందువలన ఎటువంటి కాలుష్యం ఉండదు. అంతేకాకుండా అందమైన అక్రుతులు, రంగులలో ఉండడంతో ప్రజలు ఆదరిస్తున్నారు. వీటి ధర కూడా చాలా తక్కువ ఉండడం గమనార్హం. – కొరాపుట్



వరి విత్తనాల రాఖీల విక్రయాలు



రంగురంగుల ధాన్యం రాఖీలు



ఒర్మాస్ సహకారంతో ఏర్పాటైన రాఖీల విక్రయ కేంద్రం

రాష్ట్రంపై పిడుగుల మోత

- గత ఐదేళ్లలో 1.472 మరణాలు
- తాటిచెట్లు నాటేందుకు ప్రభుత్వం సన్నాహాలు



భువనేశ్వర్: రాష్ట్రంపై మెరుపులు, పిడుగుల మృత్యువాత శాపంగా పరిణమిస్తోంది. రుతుపవనాల ఆగమనం ముందు, రుతుపవనాల చొరబాటు తర్వాత కాలంలో పిడుగుపాటు ప్రమాదాలకు జాతీయస్థాయిలో అత్యంత ప్రభావితమైన రాష్ట్రాల్లో ఒడిశా ఒకటి. ఏటా ఈ మృతులు పెరగడం ప్రభుత్వానికి కలవరపరుస్తుంది. గత ఐదేళ్లలో పిడుగుపాటుకు 1,472 మంది మరణించినట్లు ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయం సమాచారం ప్రకారం పిడుగుపాటుల నిడివి వేగం పుంజుకోవడంతో గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో 791 మరణాలు నమోదయ్యాయి. పిడుగుపాటు కారణంగా 2021–22లో మొత్తం 282 మంది, 2022–23లో 297 మంది, 2023–24లో 212 మంది మరణించారు.

2 గంటల్లో 61 వేల పిడుగులు

గతేడాది సెప్టెంబర్ 2న రాష్ట్రంలో అతి స్వల్పంగా రెండు గంటల వ్యవధిలో 61,000 పిడుగులు పడి రాష్ట్రంలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మయూర్‌భంజ్, కెంజొహర్, బాలాసోర్, భద్రక్, గంజాం, ఢెంకనాల్, కటక్, సుందర్‌గఢ్, కొరాపుట్, నవరంగ్‌పూర్ జిల్లాల్లో పిడుగుపాటుకు సంబంధించిన మరణాలు ఎక్కువగా నమోదయ్యాయి.

తాటిచెట్లతో నివారణ చర్యలు

పిడుగుపాటు వల్ల కలిగే హానికర పరిస్థితుల్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల తాటి చెట్లను నాటాలని యోచిస్తోంది.

రాష్ట్ర అటవీ మరియు వ్యవసాయ శాఖలు సమన్వయంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తాటి చెట్లను నాటుతాయి. పిడుగుపాటు హాని నివారణలో తాటిచెట్లు దోహదపడతాయని ఓ సర్వేలో తేలింది. రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి మీడియాతో మాట్లాడుతూ.. పిడుగుపాటు కారణంగా మరణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. భారత దేశంలో పిడుగుపాటు వల్ల అత్యధిక మరణాలు సంభవించే రాష్ట్రాల్లో ఒడిశా ఒకటి. ఇటీవల కాలంలో పిడుగుపాటు కారణంగా రాష్ట్రంలో కనీసం 300 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ ప్రమాదకర పరిస్థితి నుంచి బయటపడేందుకు దాదాపు 20 లక్షల తాటి చెట్లను నాటే కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తాటి చెట్లను నాటడానికి ఒక మిషన్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. పిడుగు నివారణకు ఇవి ఉత్తమ సోపానాలుగా పనిచేస్తాయి. అటవీ శాఖ నేతృత్వంలో దాదాపు 20 లక్షల తాటి చెట్లను నాటేందుకు ఇప్పటికే ఈ మిషన్‌ను ఈ కార్యాచరణ కొనసాగుతుందన్నారు. పిడుగుపాటు వల్ల రాష్ట్రంలో ప్రాణ నష్టం పూర్తిగా నివారించడమే అంతిమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ తదితరులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభకు కొత్తగా ఎన్నికైన సభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కారణం లేకుండా సభా కార్యక్రమాలను అడ్డుకుంటే రాష్ట్ర, దేశాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని హెచ్చరించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమం ద్వారా పొందిన జ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢీ మాట్లాడుతూ.. శిక్షణా కార్యక్రమం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు కొత్త దిశానిర్దేశం చేస్తుందన్నారు. అభివృద్ధి చెందిన, సంక్షేమ ఆధారిత రాష్ట్రం కోసం సభలో మంచి సంప్రదాయాలను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఏనుగుల దుర్మరణం

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో 2 ఏనుగులు దుర్మరణం పాలయ్యాయి. సుందరగడ్, సంబలపూర్ జిల్లాల్లో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. సుందరగడ్ జిల్లా బరొసుంవా రేంజ్ కొయిడా ప్రాంతంలో రైలు ఢీకొని గున్న ఏనుగు మృతి చెందింది. పట్టాల దగ్గర దీని కళేబరం పడి ఉంది. తల్లి ఏనుగు, ఏనుగుల గుంపు కళేబరం పరిసరాల్లో తిరుగాడుతున్నాయి. 6 ఏనుగులతో ఒక గున్న ఏనుగు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. ఏనుగుల గుంపు ఈ పరిసరాల్లో తిరుగాడుతుండడంతో ఈ మార్గంలో రైలు రవాణా కాసేపు స్తంభించి పోయింది. అటవీ, రైల్వే శాఖ అధికారులు ఘటనా స్థలం సందర్శించారు.

విద్యుత్ షాక్‌తో మరో ఏనుగు

విద్యుత్ షాక్‌తో సంబలపూర్ జిల్లాలో ఆడ ఏనుగు మృతి చెందింది. నొకొటిదెవులో రేంజ్ రైరఖోల్ మండలం చౌహటొపాషి గ్రామంలో ఏనుగు కళేబరం గుర్తించారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఏనుగు తొండం ఉన్నత శక్తివంతమైన విద్యుత్ తీగకు తాకడంతో ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నట్లు స్థానిక మండల అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) అరబింద మహంతి తెలిపారు.

సంక్షిప్తంగా...

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎంవీ 3 గ్రామం వద్దనున్న బీఎస్ఎఫ్ క్యాంప్ వద్ద రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 22 యూనిట్ల రక్తం సేకరించి జిల్లా రెడ్‌క్రాస్‌కు అందజేశారు. రక్తదానం చేసిన జవాన్లను బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విజయ్ సిన్హా అభినందించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ వరుణేంద్ర ప్రతాప్ సింగ్, డిప్యూటీ కమాండర్ యషస్వందిర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ ఇబ్బందులు



గర్భిణిని రైల్వే గేటు దాటిస్తున్న దృశ్యం

కొరాపుట్: రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి లేకపోవడంతో ఒక గర్భిణి అవస్థలు పడింది. ఆదివారం కొరాపుట్ జిల్లాలోని నందపూర్ సమితి పాడువా పంచాయతీలో ఈ ఘటన చోటు చేసుకుంది. రైల్వే గేట్ వద్ద నుంచి అంబులెన్స్ వెళ్లే మార్గం లేక నిండు గర్భిణిని నడిపించుకుని భారీ వర్షంలో గేటు దాటించి, అంబులెన్స్ వరకు తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా 9 గ్రామాలకు చెందిన ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నెక్కంటి

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీకల్యాణ వేంకటేశ్వర ఆలయంలో విశాఖపట్నంకు చెందిన ప్రముఖ రచయిత్రి పి.సత్యవతి రచించిన సత్యరామాయణ పుస్తకాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం రామాయణ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, ఉత్కళ ఆంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజు, బ్రాహ్మణ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న అనుష్టాన్ సభ్యులు

రాయగడ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని స్థానిక సాంస్కృతిక మహిళా అనుష్టాన్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక గురుంగుడ గ్రామంలో రోడ్లకు ఇరువైపులా వివిధ రకాలకు చెందిన 50 మొక్కలను ఆదివారం మహిళలు నాటారు. కార్యక్రమంలో అనుష్టాన్ అధ్యక్షురాలు సుజాత పాలో, కార్యదర్శి సరస్వతీ సాహు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మెగా అభిమానులు



మొక్కలు నాటుతున్న అభిమానులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మెగాస్టార్ చిరంజీవి అభిమాన సంఘం సభ్యులు గుసాని సమితి బెత్తగుడ పోలీసు రిజర్వ్‌డ్ బెటాలియన్ కార్యాలయం వద్ద మొక్కలను ఆదివారం నాటారు. ఈనెల 22వ తేదీన చిరంజీవి జన్మదినం పురస్కరించుకొని సామాజిక కార్యక్రమాలు రక్తదాన శిబిరం, మొక్కల నాటడం, రోగులకు భోజనం పంపిణీ చేపట్టనున్నట్టు సంఘం అధ్యక్షుడు అలిజింగి రాము తెలియజేశారు. కార్యక్రమంలో ఎ.కృష్ణారావు ఆచారి, చందన్ నాయక్, జీవ ఆచారి, శ్యాం, ధర్మారావు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు, విశ్రాంత కార్మికులు

జయపురం: ముడి సరుకుల కొరత కారణంగా ఉత్పత్తి నిలిచిపోయిన సేవా పేపరు మిల్లు తెరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి కోరారు. స్థానిక కార్మిక భవనంలో పేపరు మిల్లు ఉద్యోగులు, విశ్రాంత శ్రామికులు, కాంట్రాక్టు కార్మికులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లు యాజమాన్యాన్ని పిలిపించి మిల్లు పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రభుత్వం ఆదేశించాలన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో శాసనసభ ముందు ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

చిత్రకొండలో ఎంపీ బలభద్ర పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ బలభద్ర మాఝీ

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో ఎంపీ బలభద్ర మాఝీ శనివారం పర్యటించారు. దీనిలో భాగంగా చిత్రకొండ సమితి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అని శాఖల అధికారులతో అభివృద్ధిపై చర్చించారు. గ్రామాలకు రహదారులు నిర్మించాలని, విద్య, వైద్యం, తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో చిత్రకొండ తహసీల్దార్ నట్బర్ గోండో, చిత్రకొండ సమితి సభ్యురాలు రాజేశ్వరీ ఖీలో, చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్క తదితరులు పాల్గొన్నారు.

బీడీవోపై ఆరోపణలు

జయపురం: స్కూల్ యూనిఫారంలపై జయపురం బీడీవో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్వయం సహాయక గ్రూపు సంఘాల మహిళలు ఆరోపించారు. జయపురం ఎస్‌హెచ్‌జీ మహిళలను విస్మరిస్తూ బొరిగుమ్మ, కోట్‌పాడ్‌లకు ప్రాధాన్యమిస్తున్నారని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతికి ఫిర్యాదు చేశారు. బీడీవోతో చర్చించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్‌హెచ్‌జీ మహిళలు స్మిత బెహర, సూర్య కుమారి, షర్మిళ ప్రధాన్, సీతా ప్రధాన్, భారతీ గౌడ, మీన కుమారి తదితరులు పాల్గొన్నారు.

బీడీవోకు ఫోన్ చేసిన వ్యక్తి అరెస్టు



అరెస్టైన సుందర్ బారిక్

జయపురం: ఈనెల 15వ తేదీన జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్రోకి ఒక యువకుడు ఫోన్‌చేసి తాను అనుగూల్ జిల్లా కలెక్టర్‌నని చెప్పారు. ఒక జూనియర్ ఇంజినీర్‌ను అణుగూల్ జిల్లాకు బదిలీ చేశారని, ఆ బదిలీని రద్దు చేయమని ఆదేశించాడు. ఈ ఫోనుపై అనుమానం వచ్చిన బీడీవో జయపురం సదర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి బీడీవోకు కాల్ చేసిన వ్యక్తిని ఈనెల 17వ తేదీన అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి ఆదివారం వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి జయపురం సమితి బొడొజివుని గ్రామానికి చెందిన సుందర బారిక్‌గా నిర్ధారించారు. సుందర్ మహాత్మాగాంధీ గ్రామీణ రోజ్‌గార్ యోజన పథకంలో పలు అభివృద్ధి పనులు చేస్తుంటాడు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి సిద్ధ మణుగు గ్రామంలోని రాజతారా డిగ్రీ కళాశాలలో దక్షిణ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని దాదాపు 200 మందికి కంటి నిపుణులు డాక్టర్ పైడి రామ్మోహన రావు స్క్రీనింగ్ చేసి, పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్ ఆర్.ఆర్.రవి, డాక్టర్ పి.ఉషారాణి, డాక్టర్ తుషార్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్ పట్నాయక్‌తో భేటీ



నవీన్ పట్నాయక్‌తో దమన్ చిత్ర బృందం

కొరాపుట్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను దమన్ చిత్ర బృందం భువనేశ్వర్‌లోని నవీన్ నివాస్‌లో ఆదివారం కలిసింది. దీంతో చిత్ర బృందాన్ని నవీన్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్ర నిర్మాణం ద్వారా ఒడిశా చలన చిత్ర కీర్తి దేశవ్యాప్తం చేశారని కొనియాడారు.

నూతన భవనం ప్రారంభం



నూతన భవనం ప్రారంభిస్తున్న దృశ్యం

కొరాపుట్: కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ కార్యాలయం నూతన భవనాన్ని సిమిలిగుడ పట్టణంలోని అగ్ని గంగమ్మ దేవాలయం సమీపంలో బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి ఆదివారం ప్రారంభించారు. నూతన భవనంలో కార్పొరేట్ బ్యాంక్‌స్థాయిలో వసతులు, సౌకర్యాలు, కంప్యూటర్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సునాబెడా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రాజేంద్ర కుమార్ పాత్రో, కేసీసీ బ్యాంక్ ఉపాధ్యక్షురాలు దౌపది బోత్ర, డీఆర్‌సీసీ భాస్కర్ సాహులు పాల్గొన్నారు.

చిలికాలో నిలిచిపోయిన పడవ



నిలిచిపోయిన పడవ

భువనేశ్వర్: చిలికా సరస్సు మధ్యలో ప్రయాణికుల పడవ నిలిచిపోయింది. ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పడవలో యాంత్రిక లోపం కారణంగా మొంహిసా సమీపంలో ఆగిపోయింది. పడవలో 40 మందికి పైగా ప్రయాణికులు, 20 బైక్‌లు ఉన్నాయి. జొహ్నికుదా నుంచి సత్తొపాడా వెళ్తుండగా ఈ పరిస్థితి చోటు చేసుకుంది. ఆవలి తీరం నుంచి పునరుద్ధరణ బృందం వచ్చేంత వరకు దాదాపు గంటపాటు నడి సరస్సులో నిలిచిపోయింది.

క్లుప్తంగా

ఆదినారాయణ స్మారక కళాపీఠం ప్రారంభం



ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు దంపతులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో ఆదివారం ఆదినారాయణ స్మారక కళాపీఠం ప్రారంభోత్సవంతో పాటు గంటా లక్ష్మి సినీ ఆర్కెస్ట్రా ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12 గంటల పాటు నిరివ్రామంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహుతులను అలరించింది. కళాపీఠం వ్యవస్థాపకురాలు గంటా లక్ష్మి ఆధ్వర్యంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు ఎం.భీష్మారావు, అరుణ దంపతులను, మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ బురిడి అనూరాధా పరశురామ్ దంపతులను, గురువు కంది పాపాయమ్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపుగంటి ప్రకాష్, భోగరాజు సూర్యలక్ష్మి, పంపాన ప్రకాష్, కానుకల కేశవరావు, పి.విజయలక్ష్మి, బంగారు సూరి, ఎస్.మూర్తి, రామకృష్ణ, తిరుపతిరావు, గంటా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



చంటి మృతదేహం

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గొల్లవీధికి చెందిన గడిదేశి చంటి (20) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన చంటి కాకినాడలోని ప్రతిభ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ శనివారం గ్రామానికి చేరుకున్నాడు. ఇటీవల ఇండియన్ ఆర్మీ నిర్వహించిన అగ్నివీర్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇంకా రన్నింగ్ పోటీ ఉండడంతో బొబ్బిలి పట్టణంలోని కేటీఆర్ అకాడమీలో ట్రెనింగ్ తీసుకునేందుకు స్వగ్రామానికి వచ్చాడు. రానున్న వినాయక చవితికి పందిరి కర్రల కోసం ఆదివారం తన స్నేహితులతో గ్రామానికి తూర్పువైపు ఉన్న రైల్వేట్రాక్ దాటి వెళ్లాడు. వెదురు కర్రలను కొట్టుకుని తిరిగి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా... వెదుర్లు పైన ఉన్న హైటెన్షను విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదుకోవాల్సిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శ్రీను, రాధ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. శ్రీను, రాధ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా.. చంటి చిన్నవాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పాలకొండ రూరల్ : మండలంలోని అట్టలి సమీపంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ మండలం పాట్లి గ్రామానికి చెందిన అదపాక గోవింద్ (22) ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్ది నెలలుగా భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థలతో ఇటీవలే భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గోవింద్ అట్టలి సమీపంలోని మామిడితోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మృతదేహానికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితుడు)

గజపతినగరం: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, గజపతినగరం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎస్సై యు. మహేష్, సిబ్బంది శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపడుతుండగా.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దేవేందర్ కుమార్ మంజు అనే వ్యక్తి రైల్వేస్టేషన్ నుంచి గజపతినగరం వైపు వస్తున్నాడని తెలిపారు. అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా, ఆయన బ్యాగులో నాలుగు కిలోల గంజాయి పట్టుబడిందని చెప్పారు. ఈ గంజాయి విజయనగరం మీదుగా గోవా తరలించనున్నట్లు నిందితుడు తెలిపాడన్నారు. ఎవరి వద్ద గంజాయి కొనుగోలు చేశాడు.. ఎవరికి తరలిస్తున్నాడు.. వంటి వివరాలపై ఆరా తీస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీఏవీ రమణ, ఎస్సై యు.మహేష్ పాల్గొన్నారు.

భళిరా.. భళి బెంగాలీ కూలీ..!

తాడు ఉడుపు పద్ధతిలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు





పొలం గట్టుపైనే వంట చేసుకుని భోజనాలు చేస్తున్న వలస కూలీలు

- తాడు ఉడుపులో గుర్తింపు
- రైతులకు తగ్గుతున్న భారం
- పెరుగుతున్న దిగుబడి

మానిందే మందు..బతికిందే ఊరు అన్న నమ్మకంతో రాష్ట్రాలు దాటి వచ్చిన బెంగాలీ కూలీలు కష్టపడి పనిచేసి సంపాదించుకోవడమే కాకుండా మంచి పనితనంతో భళా అనిపించుకుంటున్నారు. వరినారు తీయడం, మోయడం, నాట్లు వేయడంలో వారికి వారే సాటి. వారికి పని అప్పగిస్తే మూడువంతుల ఖర్చు తగ్గడంతో పాటు సమయం కూడా కలిసివస్తోందని జిల్లా రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భామిని: తక్కువ సమయంలో తక్కువ మందితో తక్కువ నారుతో వేగంగా నాట్లు వేయడం బెంగాలీ కూలీల ప్రత్యేకత. దీని వల్ల నారుమడికి విత్తనాల వినియోగం, పెట్టుబడి ఖర్చు తగ్గుతోంది. ఫలితంగా రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వరినారు తీయడం, మోయడం, నాట్లు వేయడం అంతా బెంగాలీ కూలీల బృందమే చూసుకుంటుంది. దీంతో రైతుకు ఖర్చులు కలిసి వస్తున్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మండలంలో వ్యవసాయ బోర్లు, నీటి వసతి ఉన్న పంట పొలాల్లో బెంగాలీ కూలీలే నాట్లు వేశారు. ప్రస్తుతం వర్షాలు జోరందుకోవడంతో వర్షాధార పొలాల్లోనూ ఖరీఫ్ వరినాట్లు వేగవంతంగా తాడు ఉడుపు పద్ధతిలో వేయిస్తున్నారు. తాడు ఉడుపుతో దూర దూరంగా నాట్లు పడడంతో తెగుళ్ల బెడద ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట దిగుబడి కూడా బాగా వస్తుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బెంగాలీ కూలీల ప్రత్యేకత

పశ్చిమ బెంగాల్ నుంచి ముందస్తుగా రాష్ట్రంలోని గోదావరి జిల్లాల్లో బెంగాలీ కూలీలు ప్రవేశించారు. అలా జిల్లాలు దాటుకుంటూ ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో అడుగుపెట్టారు. వారంతా జట్టుగా వచ్చి స్థానిక పెద్ద రైతులు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్థావరాల్లో నివాసం ఉంటున్నారు.

తాడుకొలత ఉడుపు బెంగాలీల ప్రత్యేకత. మగకూలీలే వరినాట్లు వేయడం ఆకర్షణీయం. పొలం వద్ద బెంగాలీ కూలీలు వంటవార్పు చేసుకుంటూ గట్లుపైనే భోజనాలు కావిస్తుండడం చూపరులకు ఆసక్తి కలిగిస్తోంది. ఎక్కడ పొలం ఉంటే అక్కడికే గ్యాస్‌పొయ్యి, వంటపాత్రలు, నీళ్ల పట్టుకుని వెళ్లి వంట చేసుకుని తింటూ వరినాట్లు వేయడం వారి ప్రత్యేకత. వారు నాట్లు వేసే వేగం మరింతగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం జిల్లా నుంచి వంశధార ఆవల గల ఒడిశా గ్రామాల్లో బెంగాలీ ఉడుపుల బృందానికి డిమాండ్ పెరిగింది.

తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు వరినాట్లు వేయడంలో వీరు నిష్ణాతులు. పొలాల కొలతల్లో తేడా వస్తే ఆండ్రాయిడ్ ఫోన్‌లో జీపీఎస్‌తో కొలతలు తీసి విస్తీర్ణం లెక్కిస్తున్నారు. కచ్చితంగా కూలి డబ్బులు తీసుకుంటారు.

లేత నారుతో నాట్లు

రైతులు గతంలో ఎకరాకి 25 కిలోల వరి విత్తనాలు ఉపయోగించే వారు. ప్రస్తుతం బెంగాలీ కూలీల రాకతో 10 కిలోల వరి విత్తనాలు నారు పోస్తున్నారు. స్థానిక కూలీలు ముప్పై రోజుల వయస్సు గల నారుతో మాత్రమే నాట్లు వేస్తే..వీరు 15 నుంచి 20 రోజుల వయస్సు గల వరినారుతోనే నాట్లు వేయగలరు. లేత నారు నాటితే నాలుగైదు రోజుల్లో మొనలు తిరిగి వేర్లు పాకుతాయని చెబుతున్నారు. ముదురు నారుతో నాట్లు వేస్తే మొనలు పెరగడానికి 10 రోజులు పడుతుంది. వారు ఎకరాకి 10 నుంచి 15 కట్టలతో నాట్లు వేస్తారు. కూలీలు తగ్గుతారు.పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది.

మూడొంతుల ఖర్చు తక్కువ



బెంగాలీ కూలీలు నాట్లు వేయడంతో ఖర్చు తగ్గుతోంది. నారు తీత, మోత, నాట్లు వేయడం కలిసివస్తోంది. వరినారు వేయడానికి విత్తనాల ఖర్చు మిగులుతోంది. పని వేగవంతంగా సాగుతోంది. పొలం వద్దే వంటా వార్పు చేసుకోవడం వల్ల వేగంగా నాట్ల పనులు పూర్తి చేస్తున్నారు. **శివ్వాల తిరుపతిరావు, రైతు, గురండి, భామిని మండలం**

తాడు ఉడుపుతో పంట దిగుబడి



వలస కూలీలు చేస్తున్న తాడు ఉడుపు విధానం పంటకు అనుకూలం. లేలేత వరినారు వేయడం, వరుస క్రమంలో నాటడం, మొనల మధ్య సమాన దూరం ఉండడంతో పంటకు అనుకూలంగా ఉంటుంది. గాలి వెలుతురు తగులుతుంది.అధిక దిగుబడికి ఆవకాశాలు పెరుగుతున్నాయి. తక్కువ నారు ఉపయోగిస్తుండడంతో విత్తనాల వ్యయం తగ్గుతుంది. శాస్త్రీయంగా నాట్లు విధానం సక్రమైనదే. **కొర్ను సింహాచలం, ఎంఏఒ, భామిని**

పొలం పనిలో పెద్ద సారు..!



పొలంలో దిగి ఉబాలు వేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

- రైతులతో కలిసి ఉబాలు వేసిన కలెక్టర్
- సేంద్రియ ఎరువు తయారీలో సహాయం
- గుమ్మలక్ష్మీపురంలో పర్యటన

గుమ్మలక్ష్మీపురం: ఫుల్‌హ్యాండ్ షర్ట్ చేతులు మడత పెట్టి, ప్యాంట్‌ను మోకాలి వరకు మడిచి రైతులతో కలిసి పొలంలోకి దిగి ఉబాలు వేశారు వ్యవసాయం పట్ల ఆసక్తి గల కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్. అలాగే జీవామృతం వంటి ప్రకృతి ఎరువుల తయారీలోనూ రైతులతో కలిసి చేయి కలిపారు. తమతో కలిసి కలెక్టర్ ఉబాలు వేయడం, ఎరువు తయారీలో పాల్గొనడం పట్ల రైతులు సంతోషం వెలిబుచ్చారు. శతశాతం ప్రకృతి వ్యవసాయ గ్రామాలైన గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొరడ, రాయగడ జమ్ము గ్రామాలతో పాటు కురుపాం మండలంలోని కొండ బారిడి, వసలబల్లేరు గ్రామాల్లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆయా గ్రామస్తులు గిరిజన సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులను కలెక్టర్ అడిగి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తీరు, కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా మార్కెటింగ్ అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని అవకాశాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో రోజువారీ పోకడలను తెలుసుకోవాలని, తదనుగుణంగా కార్యక్రమాలు చేపట్టవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు అన్ని విధాలా సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమేనని స్పష్టం చేశారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామని, సుమారు 49వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, ఆ సంఖ్యను 75వేలకు పెంచేందుకు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. సహజ వ్యవసాయం వల్ల పంటలకు అదనపు విలువ పెరుగుతుందని, సహజ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రజలు మంచి ప్రాధాన్యం ఇస్తున్నారని, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా మేనేజర్ పి.షన్ముఖరాజు, ఎంపీడీఓ జి.రమేష్ బాబు, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఐలకు బదిలీ

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం సోషల్ మీడియా సైబర్‌సెల్ సీఐ టీవీ.విజయకుమార్‌ను అనకాపల్లి టౌన్‌కు, బొబ్బిలి టౌన్‌లో పనిచేస్తున్న ఎం.నాగేశ్వరరావును వీఆర్‌కు, ఆయన స్థానంలో రుషికొండ మెరైన్ సీఐగా పనిచేస్తున్న కటకం సతీష్ కుమార్‌ను బదిలీ చేశారు. అలాగే విజయనగరం రూరల్ సీఐగా పనిచేస్తున్న ముదిలి శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి సర్కిల్‌కు, ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా డీటీసీలో పనిచేస్తున్న గుంట్రెడ్డి అశోక్‌కుమార్‌ను బదిలీ చేశారు. పార్వతీపురం టౌన్‌లో పనిచేస్తున్న పీవీఎస్ఎన్.కృష్ణారావును వీఆర్‌కు, అల్లూరి జిల్లా డీజీఆర్‌బీ సీఐగా పనిచేస్తున్న వి.నారాయణరావును పార్వతీపురం టౌన్‌కు బదిలీచేశారు. భోగాపురంలో పనిచేస్తున్న అడబాల రవికుమార్‌ను విజయనగరం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, వీఆర్‌లో ఉన్న ఎస్‌వీ.ప్రభాకరరావును భోగాపురానికి బదిలీ చేశారు. విజయనగరం టాస్క్‌ఫోర్స్ సెల్ సీఐగా పనిచేస్తున్న కె.అశోక్ కుమార్‌ను రాజాం టౌన్‌కు, అక్కడ పనిచేస్తున్న దాడి మోహనరావును కాశీబుగ్గ బదిలీ చేశారు. విజయనగరం డీఎస్‌బీ-2లో పనిచేస్తున్న ఈ.నరసింహమూర్తిని ఉమెన్ పీఎస్‌కు, అక్కడ పనిచేస్తున్న బి.నాగేశ్వరరావును వీఆర్‌కు, డీటీసీ సీఐగా ఉన్న ఏవీ.లీలారావును డీఎస్‌బీ-2కు బదిలీచేశారు. వీఆర్-1లో ఉన్న బి.లలితను డీటీసీ విజయనగరానికి బదిలీ చేశారు.

మధుర జ్ఞాపకం..!

కరిగిపోయే కాలంలో..చెరిగిపోని మధుర స్మృతులకు ప్రతిబింబాలే ఫొటోలు. ఎన్నో భావాలు, మరెన్నో జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ తనివితీరా వీక్షించే అవకాశాన్ని ఇచ్చిన తీపి గుర్తులు ఫొటోలే. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం..ఓ కథ..ఓ అనుభూతి దాగి ఉంటుంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కెమెరా కంటికి చిక్కిన దృశ్యాలు..

– డి.సత్యనారాయణమూర్తి,
సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ప్రతిబింబం



గంగిరెద్దుతో వస్తున్నట్లు..



అయ్యకోనేరులో రంగురంగుల కొంగలు

కురిసింది వాన..



పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారిపై చేరిన వర్షపునీరు

- పార్వతీపురంలో కుండపోత
- ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాలు జలమయం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. పార్వతీపురం పట్టణం, కురుపాం, కొమరాడ, జియమ్మవలస మండలంలో శనివారం రాత్రి మూడు గంటలపాటు అతి భారీవర్షం కురవడం విశేషం. వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, బలిజిపేట, భామిని, మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పార్వతీపురం పట్టణం, వీరఘట్టంలో అధిక వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ సిబ్బంది తెలిపారు.

256.8 మి.మీ వర్షపాతం

జిల్లాలో శనివారం రాత్రి 256.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొమరాడ మండలంలో 83.2, పార్వతీపురంలో 42.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కురిసిన రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా సగటున 17.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియజేశారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీరు

వసతిగృహంలోకి చేరిన వర్షపునీరు

శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గెడ్డ ఉప్పొంగడంతో పార్వతీపురం పట్టణ శివారులో ఉన్న జ్యోతిబాపూలే బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలోకి వరద నీరు చొచ్చుకు వచ్చింది. దీంతో విద్యార్థులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రాకపోకలు లేకపోవడంతో నిత్యావసర సరుకులు చేరేందుకు దారి లేకపోవడంతో విద్యార్థుల భోజనాలకు ఇబ్బంది ఏర్పడింది.

అన్నదాతల హర్షం

జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ముఖం చాటేసిన వరుణుడు రెండు రోజులుగా అన్నదాతలను కరుణించాడు. వర్షాలు విస్తారంగా కురవడంతో పలు ప్రాంతాల్లోని పొలాల్లో నీరు చేరింది. ఈ వర్షంతో రైతులకు ఎంతో మేలు చేకూరనుంది.

జిల్లాలో వర్షపాతం నమోదు (మిల్లీమీటర్లో)

మండలం	శుక్రవారం	శనివారం
వీరఘట్టం	0.0	15.4
సీతంపేట	23.6	11.4
భామిని	15.8	7.2
పాలకొండ	47.0	4.6
కొమరాడ	20.6	83.2
గుమ్మలక్ష్మీపురం	2.4	28.8
కురుపాం	0.8	38.6
జియ్యమ్మవలస	6.4	20.8
గరుగుబిల్లి	18.4	5.2
పార్వతీపురం	22.8	42.4
మక్కువ	20.0	0.0
సీతానగరం	11.2	0.0
బలిజిపేట	1.4	8.2
సాలూరు	18.4	0.0
పాచిపెంట	346.4	0.0



వసతి గృహంలో చేరిన వర్షపు నీరు



భామిని మండలంలోని బిల్లమండ రహదారిలో చిక్కుకున్న వాహనాలు

మోటార్ వాహన చట్టం ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్



తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

విజయనగరం క్రైమ్: మోటార్ వాహన చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు నేతృత్వంలో ఎస్సైలు శంబాన రవి, లోవరాజు, ఎ.మహేశ్వరరావు, త్రినాథరావులు బృందాలుగా ఏర్పడి పట్టణంలోని గంటస్తంభం, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడులాంతర్లు, కోట జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, దాసన్నపేట రైతుబజారు, కొత్తపేట, నీళ్ల ట్యాంకు ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారన్నారు. వాహనాలు నడిపిన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సౌండ్ పొల్యూషన్, ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్స్, నో నంబర్ ప్లేట్స్ కలిగిన 104 వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే డ్రంకన్ డ్రైవ్ చేసిన ముగ్గురికి, ఎంవీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 23 ఈ చలాన్‌లు విధించినట్లు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భోగాపురం: శ్రీకాకుళం చిన్న బజారుకు చెందిన వద్దాది శంకర్‌గుప్తా అనే వ్యక్తిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యకుమారి ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చాకివలస గ్రామానికి చెందిన పద్మజ్యోతికి 2023లో శ్రీకాకుళం చినబజార్‌కు చెందిన వద్దాది శంకర్‌గుప్తాతో వివాహం జరిగింది. వివాహ సమయంలో 17 తులాల బంగారం, రెండు కేజీల వెండితో పాటు ఆరు లక్షల రూపాయల నగదు కట్నకానుకల కింద అందజేశారు. సంవత్సరం పాటు వీరి దాంపత్య జీవితం సవ్యంగా సాగింది. ఇటీవల కాలంలో కారు కొనుగోలుకు రూ. పది లక్షలు తీసుకురావాలని గుప్తా తన భార్య పద్మజ్యోతిని వేధించసాగాడు.

డబ్బులు తీసుకురాకపోవడంతో ఆమెను కన్నవారింట వదిలేసి వెళ్లిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతి వైరం మరిచి..

జాతి వైరం పూర్వం నుంచి వస్తున్నదే.. అయితే ఆధునిక సమాజంలో మూగజీవాలు సైతం జాతి వైరం మరిచిపోయి మానవ సమాజానికి సందేశాన్ని అందిస్తున్నాయి. ఎస్ఆర్ పురం వద్దనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఓ కుక్క , పిల్లి జాతివైరం మరిచి, స్నేహపూర్వకంగా తిరుగుతున్నాయి.

– శృంగవరపుకోట

